RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంచిక : 361 | సంపుటి : 02 | శనివారం 22-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00


# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

## నేడు జివో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ

### ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు




**హైదరాబాద్, నవంబర్ 21 అక్షర వేదం**
పంచాయితీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. -మిగతా 2 లో



# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

## హైదరాబాద్‌లో విలువైన భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను



**9,292 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర**

- హెచ్ఐఎల్‌టీపీ విధానం దేశ చరిత్రలోనే పెద్ద స్కాం
- ఆ భూములను పారిశ్రామికవేత్తలు తీసుకోవద్దు
- ఎవరు తీసుకున్నా మా ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులు తప్పవు
- దీనిపై న్యాయపోరాటం చేస్తాం
- ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి
- ఫార్ములా ఈ కారు రేస్‌లో నా తప్పులేదు
- లైడిటెక్టర్ టెస్టుకు సిద్ధమే : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ నవంబర్ 21 అక్షర వేదం**
హైదరాబాద్‌లో విలువైన భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కన్ను పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. రూ.ఐదు లక్షల కోట్ల భూ కుంభకోణానికి తెరలేపారని సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండిస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్ఐఎల్‌టీపీ) పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి -మిగతా 2 లో



# దుబాయ్ ఎయిర్ షోలో విషాదం

- కూలిన భారత యుద్ధ విమానం 'తేజస్' : పైలట్ మృతి
- ఆకాశంలో అలుముకున్న నల్లటి పొగ

**దుబాయ్**
దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పైలట్ మృతి చెందాడు. భారత వాయుసేనలో వినియోగిస్తున్న యుద్ధ విమానం హెచ్ఏఎల్ తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన చేస్తూ ఒక్కసారిగా నేలను తాకి కూలిపోయింది. దీంతో క్షణాల వ్యవధిలోనే మంటలు చేలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్టు భారత వైమానిక దళం ధ్రువీకరించింది. ఇందుకు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది.

**ఆకాశంలో అలుముకున్న నల్లటి పొగ**
ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. యుద్ధ విమానం -మిగతా 2 లో



# హైదరాబాద్‌లో రాష్ట్రపతి

- గవర్నర్, సీఎం స్వాగతం
- భారతీయ కళా మహౌత్సవాన్ని ప్రారంభించిన ద్రౌపదీ ముర్ము
- శనివారం ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

**హైదరాబాద్‌నవంబర్ 21 అక్షర వేదం**
భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆమె రాజ్‌భవన్ చేరుకుని అక్కడే లంచ్ అనంతరం -మిగతా 2 లో

# తెలంగాణలో 32 మంది ఐపీఎస్‌ల బదిలీ


- స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ భారీగా ఐపీఎస్‌ల బదిలీ
- పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం
- అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్,
- ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ




**హైదరాబాద్,నవంబర్ 21 అక్షర వేదం**
తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది.
డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. -మిగతా 2 లో

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు


- రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు
- నార్సింగ్డికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- కోల్‌కత్తా పరిసరాలోను ప్రభావం




**ఢాకా,**
పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్డికి 14 కిలోమిటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా -మిగతా 2 లో

# అబద్దాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

## గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం



- ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట
- గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటయింపులు
- ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,నవంబర్ 21 అక్షర వేదం**
పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని -మిగతా 2 లో



# పిపిపి ఆస్పత్రుల్లో పేదలకు 70శాతమే

## 30 శాతం పడకలు ప్రైవేటుకు

- ఏప్రిల్ నుండి యూనివర్సల్ హెల్త్ స్కీమ్
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి నవంబర్ 21 అక్షర వేదం**
రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పిపిపి వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రులలో పేదలకు 70 శాతం పడకలను మాత్రమే కేటాయించనున్నారు. ప్రైవేటుకు మిగిలిన 30 శాతం పడకలను అప్పగించనున్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణం, కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సిల్ హెల్త్ స్కీంలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు 'కొత్త మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో 70శాతం మేర -మిగతా 2 లో

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

- ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు
- జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం



2 లో

# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

మొదటి తరువాయి

ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయించనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

# దుబాయ్ ఎయిర్ షోలో విషాదం



మొదటి తరువాయి

ఒక్కసారిగా కూలి మంటలు చెలరేగిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెగెటివ్ జీ-ఫోర్స్ టర్న్ నుంచి పైలట్ యుద్ధవిమానాన్ని వెనక్కి మళ్లించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ప్రపంచంలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన అయిన దుబాయ్ ఎయిర్‌షోలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన విమానయాన సంస్థలు పాల్గొని సందడి చేస్తాయి.

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి

మొదటి తరువాయి



కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ్నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుని అక్కడ భారతీయ కళా మహౌత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఆమె తిరిగి రాజ్‌భవన్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నారు. శనివారం ఉదయం అక్కడే అల్పాహారాన్ని తీసుకుని ఆమె ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

**ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు**

**జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం**



హైదరాబాద్,
65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

మొదటి తరువాయి

కోట్ల భూకుంభకోణానికి పాల్పడాలని చూస్తున్నారని అన్నారు. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణమని కేటీఆర్ అభివర్ణించారు.

ఈ విధానం ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే రూపొందించబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్ఐఎల్‌టీపీ వాస్త వానికి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ-ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చడానికి రూపొందించబడిందని అన్నారు. ఇది కేవలం ప్రభుత్వ విధానం మాత్రమే కాదనీ, రూ.ఐదు లక్షల కోట్ల కుంభకోణం కోసం రూపొందించిన బ్లూప్రింట్ ఆరోపించారు. దీనిద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రూ.40 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల వరకు కొల్లగొట్టాలని చూస్తున్నారని వివరించారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ముసుగులో, రేవంత్‌రెడ్డి భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి తెరలేపారని అన్నారు.

**ఆ భూములకు బహిరంగవేలం నిర్వహించాలి**

హైదరాబాద్‌లోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్‌తోసహా కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించడానికి ఈ విధానాన్ని ప్రభుత్వం తెచ్చిందని కేటీఆర్ చెప్పారు. ఈ భూముల మార్కెట్



విలువ ప్రస్తుతం ఎకరాకు రూ. 40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఉందని వివరించారు. దీని విలువ మొత్తం రూ.4.50 లక్షల కోట్ల నుంచి రూ.ఐదు లక్షల కోట్ల మధ్య ఉంటుందని చెప్పారు. ఆ భూములను రేవంత్‌రెడ్డి కేవలం ప్రభుత్వ విలువలో 30 శాతానికే అప్పగించాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరిం చినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100 శాతం నుంచి 200 శాతానికి అధికంగా వసూలు చేయాలని చట్టం చేశామని గుర్తు చేశారు ఆ చట్టాన్ని సవరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఎందుకు? ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరికి లాభం చేకూర్చడానికి? అని కేటీఆర్ ప్రశ్నించారు. మార్కెట్ ధరలు, ఎస్ఆర్ఓ విలువ కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కనీసం ఎస్ఆర్ఓను కూడా పూర్తిగా వసూలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి డబ్బు అవసరమైతే ఆ భూములను బహిరంగ వేలం వేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ వ్యక్తులకు ప్రయోజనం కలిగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు.

# అబద్ధాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

మొదటి తరువాయి

ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన

పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్ధాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# పిపిపి ఆస్పత్రుల్లో పేదలకు 70శాతమే

మొదటి తరువాయి



పడకలు పేదలకు ఉచితంగా కేటాయిస్తున్నాం' అని ఆయన చెప్పారు. అంటే, ఈ 70 శాతం పడకల మేర మాత్రమే ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో 100శాతం మేర పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతున్న విషయం తెలిసిందే. సమీక్షలో సిఎం మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు పిపిపి విధానంలో చేపడుతున్నా పర్యవేక్షణ, అజమాయిషీ మాత్రం ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఈ కళాశాలల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ మోడళ్లల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులను అధ్యయనం చేయాలన్నారు. రోగులకు మెరుగైన, నాణ్యమైన సేవలు సులభంగా అందాలని, ప్రభుత్వ ప్రమాణాల ప్రకారం పనిచేసేలా చూడాలని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ విధానాన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తేవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఏ వ్యాధికి ఎంత వ్యయం చేస్తున్నామో విశ్లేషించాలని సూచించారు. ప్రజారోగ్యంలో ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానం ద్వారా వైద్యారోగ్యం రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంతో పాటు ప్రజల వ్యక్తిగత వ్యయం కూడా తగ్గేలా చూడాలని పేర్కొన్నారు. కుప్పంలో పైలట్‌గా అమలు చేస్తున్న డిజినెర్వ్ సెంటర్ సంజీవని ప్రాజెక్టు రాష్ట్రానికి ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని, వైద్య రంగంలో దేశానికి ఓ దిక్సూచిగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తామని కుప్పం ప్రాజెక్టుపై అధికారులు సిఎంకు వివరించారు. జనవరి 1 నుంచి చిత్తూరు మొత్తం సంజీవని ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రమంతా కూడా ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు సమర్ధంగా అమలు చేస్తే వైద్యరంగంలో ప్రభుత్వం చేసే వ్యయం గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించేందుకు ఓ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్న ఈ సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణలో 32 మంది ఐపీఎస్‌ల బదిలీ

మొదటి తరువాయి

ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహ మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

మొదటి తరువాయి




ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.

# పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచక పాలన ఎన్నాళ్లు..!



**46 మైసమ్మ గుళ్ళు కూల్చిన వారిపై చర్యలు ఏమైంది.**
**ప్రజలు తీవ్ర కాలుష్యంతో కొట్టుమిట్టాడుతున్నారు.**
**ఆర్ఎఫ్ సిఎల్ ఉద్యోగ బాధితులకు న్యాయం ఏమైందని ఎమ్మెల్యేను ప్రశ్నించిన వ్యాల్ల హరీష్ రెడ్డి.**

అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్21

రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి, ఇల్లు, గుళ్ళు కూల్చివేతలపై, ఆర్ ఎఫ్ సి ఎల్, బూడిద స్కామ్ లు, హెచ్ కె ఆర్ లో పాయి కారి ఒప్పందాలు, ఆంజనేయస్వామి విగ్రహం పేరుతో జరుగుతున్న దోపిడీ, బోగస్ మాటల పాలనపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు వాల్ల హరీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో హరీష్ రెడ్డి మాట్లాడారు. 46 దారి మైసమ్మ గుళ్లను కూల్చివేసిన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదో ప్రజలకు వివరించాలని హరీష్ రెడ్డి అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఒకపక్క ఇల్లు కూల్చివేస్తూ, అరాచక పాలనతో దారి మైసమ్మలను కూల్చివేయడం తీవ్ర తప్పిదమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దీనికి పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఎమ్మెల్యేకు తెలియకుండా అధికారులు కూల్చివేసారని బోగస్ మాటలు మాట్లాడుతూ, ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకు ఆంజనేయస్వామి విగ్రహము గుడి పేరుతో డబ్బులు దోపిడీ చేసే పథకానికి తెరలేపారని, ప్రజలకు పూర్తి పారదర్శక పాలన అందించాల్సింది పోయి ధనార్జన ధ్యేయంగా రామగుండంలో గూండా పాలన నడుస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులలో నిర్మించే ఆలయానికి నిధుల సేకరణ ఎలా చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గుళ్ళు కూల్చివేసిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రజల ఆస్తులకు రక్షణగా పారదర్శక పాలన అందించాల్సింది పోయి ప్రజల ఆస్తులు ప్రభుత్వ స్థలాలను అర్ధరాత్రి పూట ధ్వంసం చేస్తున్నారని భవిష్యత్తులో ప్రజలే మీకు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. రాష్ట్రంలో డైవర్ట్ పాలన కొనసాగిస్తూ కేటీఆర్ ను అరెస్టు చేస్తామని కుట్రలు చేస్తున్నారని, అరాచక పాలన ముగించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. రామగుండంలో కాలుష్యం అధికమవుతుందని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. రామగుండంలో ఇందిరమ్మ ఇల్లు ఎందరికీ ఇచ్చారు. 900 కోట్ల రూపాయల సింగరేణి నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారు. ఆర్ ఎఫ్ సి ఎల్ ఉద్యోగాల బాధితులకు ఎందరికీ న్యాయం జరిగిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిత శివకుమార్, మెరుగు చంద్రమౌళి, పోలాడి శ్రీనివాసరావు, అనుముల కళావతి, బూరుగు వంశీకృష్ణ, పర్స స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జెఎసి విస్తృతస్థాయి సమావేశం తీర్మానాలు

అక్షర వేదం

బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం హైదరాబాద్లోని కాచిగూడ లో ఉన్న హోటల్ అభినంద్ గ్రాండ్ హోటల్ లో జరిగింది. ఈ సమావేశంలో బీసీ సంఘాలు కుల సంఘాలు మేధావులు విద్యావంతులు ఉద్యోగులు విద్యార్థి యువజన మహిళలు సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు.

1) చట్టబద్ధమైన 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికలను తక్షణమే ఆపివేయాలి.

2) పార్టీలపరంగా బీసీలకు 42 శాతం ఇస్తామన్న రిజర్వేషన్ను అంగీకరించేది లేదు, బీసీలకు భిక్షంగా ఇచ్చే వాటా వద్దు.. రాజ్యాంగబద్ధంగా వచ్చే వాటా కావాల్సిందే.

3) తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సమగ్ర కులగణనలో బీసీల జనాభా 56 శాతం లెక్క తేలితే, ఇప్పుడు 42 శాతం ఇస్తామనడం బీసీలను రాజకీయంగా వంచించడమే అవుతుంది.

4) బీసీ రిజర్వేషన్ల అంశంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులతో చర్చించాలి.

5) బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధమైన సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ జరపాలి.

6) డిసెంబర్ ఒకటవ తేదీ నుండి జరిగే



పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ నుండి బీసీ రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలి.

7) కాంగ్రెస్ పార్టీ బీసీలను నమ్మించి మోసం చేయకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచడానికి జాతీయ స్థాయిలో ఇండియా కూటమి తరఫున పార్లమెంట్ వేదికగా పోరాటం చేయడానికి ఢిల్లీలో రాజకీయ కార్యాచరణ ప్రకటించాలి.

8) బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని అమోదించే అవకాశం ఉన్నప్పటికీ, సర్పంచ్ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు లు బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి.

9) తాము అధికారంలోకొస్తే బీసీనే సీఎం చేస్తామని ప్రకటించిన బిజెపి పార్టీకి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీ రిజర్వేషన్ల అంశంపై తక్షణమే ప్రధాని నరేంద్ర మోడీని ఒప్పించి ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లుకు ఆమోదం తెలిపేలా కృషి చేయాలి.

10) బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న రాష్ట్ర బంధ్ తర్వాత నవంబర్ 2న రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయించిన అష్టాంగ ఆందోళన కార్యాక్రమాలలో భాగంగా ఇప్పటికి 6న పూలే అంబేద్కర్ విగ్రహాల ముందు నిరసనలు, 13న ధర్మ పోరాట దీక్షలు, 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్ ర్యాలీలు, 18న ఎంపీలతో ములకత్, మరియు రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు ధర్నాలు నిర్వహించిన బీసీ శ్రేణులకు అభినందనలు, ఇక ఈ నెల నవంబర్ 25న రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దగ్ధం, 30న బీసీల రాజకీయ యుద్ధ బేరి పేరుతో చలో హైదరాబాద్, డిసెంబర్ 8, 9 ఛలో ఢిల్లీ పేరుతో పార్లమెంటు ముట్టడి తదితర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్ , రాజకీయ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం చంద్రమౌళి ,నాయకులు నందికంటి సాయి కుమార్ గారలు మన మేదరి మహేంద్ర సంఘం తరుపున పాల్గొన్నారు

# ఆటో ప్రయాణికుల భద్రత కోసం అభయ యాప్..!!

అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా ,ఎస్పీ కార్యాలయం :-నవంబర్ 21.

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో ఆటో ప్రయాణికుల భద్రతను బలపరిచే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1281 ఆటో వాహనాలకు "మై టాక్సీ సేఫ్ " అనే అభయ యాప్‌కు సంబంధించిన క్యూ ఆర్ కోడ్ అమర్చడం పూర్తయింది.

ఆటో నడిపే వ్యక్తులను ఒక సంస్థతో అనుసంధానం చేసి, ప్రతి సంవత్సరం 350 రూపాయల ప్రీమియంతో ప్రమాదంలో మరణానికి ఒక లక్ష రూపాయల భీమా అందే విధంగా ఏర్పాటు చేశారు. ఈ భీమా పత్రాలు డ్రైవర్లకు అందజేశారు.

**ప్రయాణికులకు తక్షణ భద్రతా సమాచారం..**

ఆటోలో అసురక్షిత పరిస్థితి ఎదురైనప్పుడు, ప్రయాణికులు ఆటోపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే-డ్రైవర్ ఫోటో,వ్యక్తిగత వివరాలు,వాహన సమాచారముతక్షణమే మొబైల్‌లో కనిపిస్తాయి.ఫోన్ నంబర్‌ని యాప్‌లో నమోదు చేసి "ప్రదేశాన్ని తెలుసుకోండి" అనే ఎంపికను ఎంచుకుంటే,అత్యవసర కాల్,అత్యవసర ఫిర్యాదు అనే రెండు ఎంపికలు కనిపిస్తాయి.లైవ్ స్థానం కమాండ్ కేంద్రానికి ప్రయాణికుడు అత్యవసర కాల్




లేదా ఫిర్యాదు పంపిన వెంటనే, వారి లైవ్ స్థానం కమాండ్ కేంద్రానికి చేరుతుంది. ఆటోలో ఎక్కిన క్షణం నుండి దిగే వరకు కమాండ్ కేంద్రం ద్వారా గమనిక కొనసాగుతుంది. సమీపంలోని పోలీసు సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని రక్షణ చర్యలు తీసుకుంటారు.

**అభయ యాప్ ముఖ్య ప్రయోజనాలు**

-మహిళా ప్రయాణికులు ఆటో ఎక్కే ముందు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి డ్రైవర్ వివరాలు చూసుకోవచ్చు.

-ప్రయాణ సమయంలో ఏదైనా వస్తువులు మరిచిపోయినా, యాప్ ద్వారా ఆటోను గుర్తించి తిరిగి పొందవచ్చు.

-ఆ ఆటో డ్రైవర్ గతంలో ఏదైనా నేరంలో పాలుపంచుకున్నట్లైతే, స్కాన్ చేసిన వెంటనే "ఈ ఆటో సురక్షితం కాదు" అనే ఎరుపు సూచన కనిపిస్తుంది.

-అసభ్య ప్రవర్తన, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం, ఢీకొట్టి పారిపోవడం వంటి ఘటనలను కూడా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

-ప్రయాణం పూర్తయ్యాక డ్రైవర్‌కు రేటింగ్ ఇవ్వడానికి కూడా అవకాశం ఉంది.పోలీసులు ఆటో నడిపే వ్యక్తులు నియమాలు పాటిస్తూ, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ..కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతిరావు, టౌన్ సిఐ మహేందర్ రెడ్డి, బయ్యారం సీఐ రవికుమార్,, డోర్నకల్ సీఐ చంద్రమౌళి, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది, అభయయాప్ రూపకర్త అభిచరన్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా కు వందనం తెలుపుతూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



అక్షర వేదం /మరిపెడ మండలం, భాల్నిధర్మారం గ్రామం:- నవంబర్ 21.

నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ పెద్దలు బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశానుసారం బాల్ని ధర్మారం మత్స్య కారుల సంఘం అధ్యక్షుడు ఎస్. వీరాస్వామి ఆధ్వర్యములో జెండా ఆవిష్కరించి జెండా వందనం చెయ్యటం జరిగింది. ఇందులో మాజీ అధ్యక్షులు కొప్పేర శ్రీనివాస్ , కార్యదర్శి జి. ముని బాబు, ఉపాధ్యక్షులు, ఎస్. కిష్టయ్య ,డైరెక్టర్లు సిహెచ్. రమేష్ కాకి భద్రయ్య కాకి వీరన్న ,జి. నాగరాజు, జి. రమేష్ ,కే. ఉప్పలయ్య ,ఎస్.యాదగిరి ,బండారి వెంకన్న ,తోట రామయ్య, కాకి సురేష్, కాకి కృష్ణ ,మాజీ ఎం.పీ.టీ.సి.జంగం విజయ లక్ష్మీ మరియు ముదిరాజ్ బందువులు రావడం జరిగింది ఇదే విధంగా ముందుకు వెళ్తూ ముదిరాజ్ లు అభివృద్ధి చెందాలని ప్రపంచ మత్స్య కారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ బాల్ని ధర్మారం ముదిరాజ్ లా సంఘం సభ్యులు.

## రైల్వే ప్రాజెక్ట్ సాధించేవరకు నడుం బిగిద్దాం....

– ప్రచార కరపత్రం ఆవిష్కరణ



అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా :- నవంబర్ 21.

మహబూబాబాద్ కు రైల్వే శాఖ మంజూరు చేసిన రైల్వే మెగా మైంటెనెన్స్ డిపోను వేరే ప్రాంతానికి తరలించే కుట్రలు జరుగుతున్నాయనే వార్తలు ప్రముఖంగా రావడంతో ప్రాజెక్ట్ సాధనకోసం అన్నివర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు నడుం బిగించాలని మహబూబాబాద్ పట్టణంలోని మజీద్ పాన్ షాప్ నిర్వాహకులు ఆవిష్కరించిన ప్రచార కరపత్రం సంచలనం సృష్టిస్తుంది...మహబూబాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి రైల్వే ప్రాజెక్టు ఎంతో దోహదం చేస్తుందని ఎంఏ ఫరీద్, ఎంఏ వహీద్ లు పేర్కొన్నారు. మానుకోట కు మంజూరైన ప్రాజెక్టు స్టేషన్ ఘనపూర్ ప్రాంతానికి తరలి వెళ్తుందనే ప్రచారం విస్తృతంగా జరుగుతుందని వారు పేర్కొన్నారు...రైల్వే ప్రాజెక్టు మానుకోట నుండి అన్యాయంగా తరలిపోకుండా అడ్డుకోవాలని వారు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు...

## మంథని మాత శిశు ఆస్పత్రిలో ప్రారంభమైన గైనిక్ సేవలు



అక్షర వేదం/మంథని,నవంబర్ 21:

మంథని మాత శిశు ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,జిల్లా సూపరిడెంట్ డాక్టర్ శ్రీధర్ ప్రత్యేక చొరవతో మంథని ఆసుపత్రిలో గైనిక్ సేవలను పునర్ ప్రారంభించడం జరిగింది.గర్భిణీలు దూర ప్రాంతాలకు వెల్లి డబ్బులు ఖర్చు చేసుకోకుండా మంథని పరిసర ప్రాంతాల గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు..

## సమగ్ర శిక్ష అభియాన్ విద్యా శాఖ ఆధ్వర్యంలో ఓఎస్సీ సర్వే



అక్షర వేదం/మంథని,నవంబర్21:

పాఠశాల చదువు మధ్యలో మానేసి,ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన పిల్లలను గుర్తించి వారి స్థాయిని బట్టి క్లాసులలో చేర్పించే విధంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సర్వే నిర్వహిస్తున్నారు.ఆ సర్వేలో భాగంగా రెండో రోజైన శుక్రవారం రోజున జడ్పిహెచ్ఎస్ ఆరెంద పాఠశాలలోని మల్లారం గ్రామంలో దూడపాక ఆది తండ్రి సతీష్ ఎనిమిదవ తరగతి చదువుతూ గత మూడు నెలలుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నట్లుగా గుర్తించి వారి తల్లిదండ్రులను కలిసి పిల్లవాడితో మాట్లాడి చదువు చదువు కోవడం వల్ల ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని వారితో మాట్లాడి పాఠశాలలో చేరే విధంగా సిఆర్పి మల్లన్న తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఆరెంద పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గియాశోధిన్,గణిత ఉపాధ్యాయుడు సహిందర్ పాల్గొన్నారు..

# నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇండ్లు



**అక్షర వేదం /ఖానాపూరం మండలం,నాజీ తండా, నర్సంపేట:-నవంబర్ 21.**
దశాబ్ద కాలంగా నిరీక్షించిన నెరవేరని కల.నేడు ప్రజాపాలనలో ఇందిరమ్మ ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తున్న తరుణం.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారంగా నాజీ తండా గ్రామానికి, నూతనంగా మరో 16 ఇందిరమ్మ ఇండ్లు , ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, శాఖమూరి హరిబాబు మరియు నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ,అయినందున ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల భూక్య సేవ్య మరియు భూక్య నీల నాగేంద్ర భూమి పూజ కార్యక్రమంలో నాజీ తండా పంచాయతీ కార్యదర్శి బాలు సార్ నాజీ తండా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మోహన్ మరియు ఖానాపురం ఎన్ .ఎస్.యు.ఐ.మండల అనిల్ రాథోడ్ మరియు తదితరులు పాల్గొన్నారు... నాజీ తండా కాంగ్రెస్ గ్రామ పార్టీ.

# భరత నాట్య ప్రదర్శనలో జాతీయ నాట్య కళా భారతి పురస్కారం



**అక్షర వేదం/మంథని,నవంబర్21:**
కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అమరావతిలో నిర్వహించిన సాంస్కృతిక వేడుకలు భూపాలపల్లి చిన్నారుల భరతనాట్య ప్రదర్శనతో మరింత శోభాయమానంగా మారాయి.మంథనికి చెందిన ప్రముఖ భరత నాట్య గురువు, భూపాలపల్లి వాస్తవ్యులు అయిన తుర్పాటి తిరుపతి నాని,తమ శిష్య బృందంతో కలిసి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు.వారి ప్రదర్శించిన భరతనాట్యం వైభవం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ ప్రదర్శనకు గాను,గురువు తిరుపతి నానిని వారి శిష్య బృందాన్ని జాతీయ నాట్య కళాభారతి పురస్కారంతో సత్కరించారు.శ్రీకాళహస్తి దేవస్థానం సూపరిండెంట్ మాధురి చేతుల మీదుగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బుచ్చిశ్వర రావు సమక్షంలో ఈ గౌరవాన్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలోని భక్తులు,ప్రజలు పాల్గొని భూపాలపల్లి చిన్నారుల ప్రతిభను,గురువు నానిని అభినందించారు.ఇలాంటి వేడుకలలో శాస్త్రీయ నాట్యానికి వేదిక కల్పించడం చాలా ఆనందంగా ఉందని పలువురు తెలియజేశారు. చిన్నారులకు శాస్త్రీయంగా నాట్యం నేర్పించి ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై ప్రదర్శిస్తున్న నాని మాస్టర్ కృషిని,అంకితభావాన్ని వారు ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేశారు..

# హృదయం చురుకుగా ఉంటే వయసు అడ్డుకాదు అని ఈ వ్యక్తి మళ్లీ చూపించాడు



**అక్షర వేదం/స్పెషల్ న్యూస్, హైదరాబాద్:-నవంబర్ 21.**
అతని కదలికల్లో కనిపించే ఉత్సాహం చూసి ఎవరికైనా చిరునవ్వు వస్తుంది. సరళంగా, ఆనందంగా జీవించడం ఎంత అందమైనదో అతడి ప్రదర్శన చెబుతోంది. మనసు తేలికగా ఉంటే ప్రతి రోజు కొత్తగా అనిపిస్తుందని అతడు నిరూపించాడు. అతని నృత్యంలో చిన్నపిల్లల జోష్, పెద్దల అనుభవం రెండూ కనిపిస్తాయి. చూసేవారికి కూడా పాజిటివ్ ఎనర్జీ కలిగించేలా అతను ప్రవర్తిస్తాడు. చురుకుదనం శరీరంలో కాదు, మనసులో ఉండాలని అతడు తెలిపాడు. చిన్న ఆనందాలే మన జీవితాన్ని పెద్దదిగా మారుస్తాయని ఆయన చూపించాడు.

# బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై సమీక్ష

**- ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తప్పవు**



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 21**
రామగుండం మున్సిపల్ పరిధిలో బయో-మెడికల్ వ్యర్థాల సక్రమ నిర్వహణపై డాక్టర్ వి. వాణిశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, డెంటల్ క్లినిక్స్, స్కాన్ సెంటర్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జె. అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..మున్సిపల్ వ్యర్థాలతో బయోమెడికల్ వ్యర్థాలను కలిపి పారవేసే ఆసుపత్రులపైన కఠిన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని స్పష్టం చేశారు. దీని వల్ల మున్సిపల్ కార్మికులు ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉందని అలాగే ఇది పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్యానికి ముప్పు కలిగిస్తుందని పేర్కొన్నారు. అన్ని ఆసుపత్రులు అధీకృత బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ఏజెన్సీలతో తప్పనిసరిగా టై-అప్ చేసుకోవాలని, మున్సిపల్‌కు ఇస్తున్న వ్యర్థాలలో బయోమెడికల్ వ్యర్థాలు కనిపిస్తే బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం-2016, మున్సిపల్ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 ప్రకారం జరిమానాలు మరియు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుండి అనుమతి తప్పనిసరిగా కలిగి ఉండాలని, అలాగే గుర్తింపు పొందిన బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ఏజెన్సీతో టై-అప్ పొందాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన గైడ్‌లైన్స్ మేరకు బయోమెడికల్ వేస్ట్‌ను సోర్స్ వద్దనే కలర్ కోడ్ బిన్స్‌లో వేరు చేయాలని తెలిపారు. సెగ్రిగేషన్ సరిగా చేయకపోతే ఏజెన్సీలు వ్యర్థాలను తీసుకునేందుకు నిరాకరించే అవకాశం ఉందని, అప్పుడు అవి మున్సిపల్ వేస్టేజ్‌తో కలుపబడే ప్రమాదం ఉందని చెప్పారు. అలాంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఏజెన్సీ వాహనం రాకపోయినా, టై-అప్ రిన్యువల్ చేసు కోక పోయినా పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సమాచారం అందిస్తే, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారు తెలిపారు. ఆరోగ్య శాఖ కు తెలియ జేస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్-2010 ప్రకారం చర్యలు తీసుకుంటామని అని అన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు, ఐ.ఎం.ఎ. సభ్యులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపాలిటీ సీనియర్ అదనపు డిప్యూటీ కమిషనర్లు, డా. కృపాబాయి (ఆర్.ఎం.ఓ., ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండం), బయోమెడికల్ వేస్ట్ ఏజెన్సీ ప్రతినిధి సతీశ్, ఐ.ఎం.ఎ. అధ్యక్షులు క్యాసాని శ్రీనివాస్, డాక్టర్లు లక్ష్మీవేణి, డా. రాపోలు వనజ, డా. దామెర అనీల్ కుమార్, ప్రైవేట్ ఆసుపత్రుల యజమానులు సిబ్బంది పాల్గొన్నారు.

# తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం.

**- తొర్రూరు మండల విద్యాశాఖాధికారి మహంకాళి బుచ్చయ్య**




గత మూడున్నర దశాబ్దాలుగా తొర్రూరు మరియు పరిసర గ్రామాలలో ప్రజల అవసరాలను గుర్తించి వారికి చేయూతనిచ్చే దిశగా కృషి చేస్తున్న తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, మహబూబాద్ జిల్లా తొర్రూరు మండల విద్యాశాఖాధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు.ఆయన శుక్రవారం రోజున మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్ణం రాంనర్సయ్య గారి కుమారుడు చిరంజీవి మోహిత్ జన్మదినం పురస్కరించుకొని సుమారు 20వేల రూపాయల విలువ గల కలర్ టీవీని పాఠశాలకు బహూకరించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.నేటి డిజిటల్ యుగంలో ఉపాధ్యాయులు ఈ కలర్ టీవీని ఓ బోధనోపకరణంగా ఉపయోగించి బోధిస్తే, విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని అన్నారు.క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సుర్ణం రాంనర్సయ్య మాట్లాడుతూ మా నూతన కార్యవర్గం సమిష్టి నాయకత్వంలో ఇప్పటికే 500 కు పైగా సేవా కార్యక్రమాలు పూర్తి చేశామని ఇదే స్ఫూర్తితో రాబోయే కాలంలో నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రధానంగా 600 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలతో పాటుగా,విజేతలైన విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలు,సన్నూరు ఎక్స్ రోడ్డు నందు ప్రయాణికుల సౌకర్యార్థమై షెడ్ నిర్మాణం, పలు వైద్య శిబిరాలు, నేత్రాల సేకరణ,లాంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తద్వారా లయన్స్ జిల్లా స్థాయిలో ఉత్తమ క్లబ్ గా తొర్రూర్ లయన్స్ క్లబ్ ఎంపిక కాబడిందనియూ,ఇదే స్ఫూర్తితో మరింత వేగవంతంగా,నాణ్యంగా, నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి లయన్ ముడుపు రవీందర్ రెడ్డి,కోశాధికారి లయన్ వజినేపల్లి శ్రీనివాస్,సంయుక్త కార్యదర్శి లయన్ భోనగిరి శంకర్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరునగరి స్వాతి,సహ ఉపాధ్యాయులు సునిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతివాదులైన ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ

**అక్షర వేదం/మంథని,నవంబర్ 21:**
పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో గల మంథని నుండి కాటారం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 314 లో అక్టోబర్ 31న జరిగిన కూల్చివేత పై భాదితురాలు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ డ్యూ టు ప్రాసెస్ ఆఫ్ లా ప్రకారం మాత్రమే ముందుకు వెళ్లాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ దాఖలుకు కేసును నాలుగు వారాలకు వాయిదా వేసిన న్యాయస్థానం.ఎస్టీ కులానికి చెందిన శ్రీమతి కుర్ర పోచమ్మ 2002లో రెవెన్యూ శాఖ సర్వే నంబర్ 314లో జారీ చేసిన నివేషణ స్థల స్వాధీన పత్రం ద్వారా రెండు గుంటల పట్టా పొంది,2010 లో గ్రామ పంచాయతీ నుండి గృహ నిర్మాణ అనుమతి పొంది అప్పటి నుండి ఇంటి పన్ను చెల్లిస్తూ ఉన్నారు.కాగా అక్టోబర్ 31న ఉదయం 6 గంటలకు పిటిషనర్ కు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా,రెవెన్యూ, మున్సిపల్ చట్టాలు పాటించకుండా పెద్ద ఎత్తున రెవెన్యూ,పోలీస్,మున్సిపాలిటీ శాఖల అధికారులు కట్టు బట్టలతో బయటకు నెట్టి తమ ఇంటిని మొత్తం కూల్చి వేశారని పిటిషనర్ తెలిపారు.దీనిపై భాదితురాలు కుర్ర పోచమ్మ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా శుక్రవారం రోజున పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వేణు గోపాల్ తదుపరి చర్యల కోసం డ్యూ టు ప్రాసెస్ ఆఫ్ లా ప్రకారమే అధికారులు ముందుకు సాగాలని తెలిపారు.అదేవిధంగా రిట్ పిటిషన్ లో ప్రతివాదులైన పెద్దపల్లి జిల్లా కలెక్టర్,మంథని ఆర్డిఓ, తహసీల్దార్,మంథని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్,ఎస్ఐ,మున్సిపల్ కమీషనర్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్,మంథని రెవెన్యూ ఇన్స్పెక్టర్ కు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ కోసం ఆదేశాలు ఇచ్చారు.కాగా ఇట్టి పిటిషన్ ను మంథని కి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ దాఖలు చేయగా,సీనియర్ న్యాయవాది కొంగల మోహన్ గౌడ్ తమ వాదనలు వినిపించారు..

# తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలకు రంగం సిద్ధం.

**అక్షర వేదం/ మరిపెడ మండలం:-నవంబర్ 21.**
- ఈ నెల 26న సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్.
డిసెంబర్ 11,14,17వ తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికల నిర్వహణకు అధికారుల సన్నాహాలు.
పాత రిజర్వేషన్‌లతోనే సర్పంచ్ ఎన్నికలు.
సోమవారం రోజున గ్రామాల వారీగా రిజర్వేషన్ల రోస్టర్ విడుదలకు రంగం సిద్ధం.



# మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్: ధృఢత, దార్వ్యం, ప్రజాసేవకు ప్రతీక!

**- ఫ్రెండ్లీ పోలీసింగ్ కి పెద్ద పీట బదిలీపై ములుగు వెళ్తున్న సందర్భంగా మీకు వీడ్కోలు...**



**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా :- నవంబర్ 21.**

మహబూబాబాద్ జిల్లా ఇటీవల కేవలం పరిపాలనా మార్పులతోనే కాదు, పక్కా న్యాయ సంగ్రహ దృష్టితో ముందుకు సాగెందుకు, జవాబుదారీతనాన్ని ఇచ్చిన జిల్లా పోలీస్ సూపరిండెంట్ శ్రీ సుధీర్ రాంనాథ్ ఆర్ కేకన్ బదిలీ చాలా బాధకరం.సామాన్యంగా ప్రజలకు పోలీసు అంటే భయం అనే భావన ఉంటే, కేకన్ గారి సేవల వల్ల పోలీసు అంటే మిత్ర అనే విదంగా భవిష్యత్తులో మహబూబాబాద్ జిల్లాలో పొంచి ఉన్న నేరాలను, అన్ని రకాల మాఫియాలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే వారిని, భద్రతలేని వాతావరణాన్ని మార్చేందుకు ఈ యువ ఐపీఎస్ అధికారి కృషి చేసాడు.

**మాఫియాలపై కఠిన హెచ్చరికలు**

బదిలీపై వచ్చిన కొత్తలో జిల్లాలో బెల్లం, గుట్కా, బియ్యం, ఇసుక భూమాఫియాతో పోలీస్ వ్యవస్థకు సవాల్ గా అప్పటి రాజకీయ వ్యవస్థ దీటుగా ఉండేది.ఇది గమనించిన ఎస్పీ కేకన్, స్వయంగా సర్వే నిర్వహించి ఈ మాఫియా వ్యవస్థను మట్టికరిపించాలని ప్రతిన పూనాడు. మాఫియాగా ఉండి నేరాలు చేసిన, ఉసిగొల్పిన ఒక్కొక్కర్ని చట్టపరంగా టార్గెట్ చేస్తాం అని స్పష్టం చేయడం, వారిపై ఉక్కుపాదం మోపడంతో నేరాలు తగ్గుముఖం పట్టాయి.జిల్లాలో ఎస్పీ రామ్ నాథ్ ఆర్ కేకన్ సర్జికల్ అక్టివిజం ప్రజల్లో విశ్వాసానికి మార్గం కాగా, అన్ని రకాల మాఫియాలకు చెరలు తెరుచుకున్నాయి.ఒకటే దెబ్బలో, అక్రమ రవాణా మార్గాలపై పటిష్ట దాడులు మాఫియాగాళ్ళు చప్పుడు పెద్దగా చేయకుండానే చట్టముందు చేతులెత్తేశారు. బాధ్యత లోపించకుండా కష్టపడి పని చేస్తే పోలీస్ బలగం కూడా "ప్రజా సేవ కోసం" పని చేసే ప్రత్యేక ఏజెన్సీ అవుతుందని పేర్కొనే ఎస్పీ కేకన్ అనేవారు. జిల్లాలో పోలీస్ అధికారుల లోపాలను గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన ఏసీబీ అధికారులు దాడులలో ఒక ఎస్. ఐ, ఒక సీఐ, పట్టుబడడం, ఇద్దరు కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్‌లోనే మద్యం సేవించారని వచ్చిన ఆరోపణలను నిర్ధారించి, వెంటనే సస్పెన్షన్ చర్యలు చేపట్టారు. కొందరిని సుతి మెత్తగా మండలించడం, కొందరిని తగు హెచ్చరికలు చేయడం, పోలీస్ సంక్షేమం పట్ల శ్రద్ధ, వారి కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతుకలతో స్నేహంతో ఉండడం ఆయన ప్రత్యేకత. ఎస్పీ కేకన్ తీరు ఒక పాఠం ప్రజల కోసం మీరు పని చేసి ఉంటే, మేం మీ వెంటే ఉంటాం...తేడా వస్తే చట్టం కఠినంగా ఉంటుందని చెప్పకనే చెప్పేవారు. అంతకు ముందు పని చేసిన ఐపీఎస్ లు కొంత రాజకీయ ప్రభావంతో పని చేసినట్లు ఆరోపణలు ఉండేవి, ఈ ఎస్పీకి అటువంటి నిందలు లేకుండా ఇక్కడ నుండి బదిలీ అవుతున్నారు. కేకన్ దృష్టిలో ప్రజలుకు భద్రత కల్పించటమే కాదు, వారిని చట్టపరమైన అవగాహన కలివిడిగా, నైతికంగా తీర్చిదిద్దటం ముఖ్యం. ఇందుకోసం ఆయన ఇటీవల పిల్లల దినోత్సవం నాడు సామాజిక సందేశాలు ఇవ్వడం, పాఠశాల కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అనేక కార్యక్రమాల్లో చేసారు. పిల్లల భవిష్యత్ సురక్షితం చేస్తే వారి భవిష్యత్ బంగారంలా ఉంటుందని ఎప్పుడు ఆయన అంటుంటారు. మన చరిత్రకు బయాన్నిచ్చే ప్రశ్నగా మిగిలిపోకూడదు అంటూ కొన్ని పోస్టులను తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఆయన పంచుకున్నారు. ప్రజలకు సైతం వాట్సాప్ వేదిక ద్వారా పిర్యాదులు స్వీకరించి పనులు చెక్క బెట్టారు.

**మహబూబాబాద్ భవిష్యత్తు చట్టస్వరూపంగా కేకన్ కృషి**

మాఫియాలు, మోరల్ సిస్టములో లోపాలు, చిన్ననేరాలు, ప్రశాంత జీవనాన్ని భ్రష్టు పట్టించే హింసాత్మకత ఇవన్నీ నుండి మహబూబాబాద్‌ను కాపాడేందుకు ఎస్పీ కేకన్ ఆయన పోలీస్ బృందం చేసిన కృషి అభినందనీయం. ఒక్క మాటలో చెప్పాలంటే రాము నాథ్ కేకన్ ఉన్నంత వరకూ నేరానికి భయమే...

**నమ్మకంమే వృత్తి, తేట తెల్లని ఉన్న వ్యక్తిత్వం**

శాంతి ఒక వాగ్దానం కాదు, శ్రమ కన్నా పెద్ద శక్తి. ఈ భావనను పునర్జీవింపజేసినసుధీర్ రాంనాథ్ ఆర్ కేకన్, మహబూబాబాద్ ఎస్పీ గా చరిత్రలో మిగిలిపోతారు. ప్రజల భద్రత, చట్ట ప్రగతి, వ్యక్తిగత వినయం ఇవన్నీ కలగలిపిన సమగ్ర నాయకత్వం ఆయనది. ముందు ముందు ఆయన ప్రభుత్వ ప్రశంశలు, ఎన్నో పదవులు, ఉన్నత శిఖరాలు అవిరోదించాలని ప్రజలు, పోలీస్ సిబ్బంది, పోలీస్ అధికారులు కోరుతున్నారు.

**సేవ కార్యక్రమాల్లో పెట్టింది పేరు...**

విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ మేళలు, అనాధ పిల్లలను అక్కున చేర్చుకోవడం, ఆర్థిక సహాయం చేయడం, పోలీస్, జర్నలిస్ట్ ఇంటారెక్ట్ కార్యక్రమాలు, క్రీడలు, యువతతో క్రీడలు ఆడుతు కలిసిపోవడం, పకృతి విపత్తుల సహాయం, ఆదివాసి గుండెల్లో సందర్శన, యూరియా పంపిణిలో ఆయన ముందు చూపు, పేదలతో ఆఫీస్ అయిన క్యాంప్ ఆఫీస్ అయిన ఆయన ఎప్పుడు అందుబాటులో ఉంటూ పోలీసులను పౌర సేవలకు మల్లించడంలో ఎస్పీ రామ్ నాథ్ కేకన్ మార్క్ మహబూబాబాద్ జిల్లా ప్రజలకు ఎప్పుడు మనస్సులో చేరిగిపోదు.

**ఆయనకు ఘనంగా వీడ్కోలు**

జిల్లా ప్రజల మనస్సు దోచిన ఎస్పీ రామ్ నాథ్ ఆర్ కేకన్ కు ఘనమైన వీడ్కోలు పలకాలి. ఆయనకు రేపటి నుండి వ్యక్తి గతంగా కలిసి, ఆయన సేవలు స్మరించుకొని చెప్పే వీడ్కోలు ఆయనకు భవిష్యత్ లో ఇంకా అధిక సేవ చేయాలనే తపన కలిగిస్తుంది. జిల్లా ప్రజలు ఎస్పీ కేకన్ ను వీడ్కోలు కృతజ్ఞతలు తెలుపండి.

**డి. వై. గిరి**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**మహబూబాబాద్**
**సెల్ : 7013667743**

## గోపి నగర్ బీసీ హాస్టల్ పిల్లలకు మత్తు పదార్థాల పట్ల అవగాహన కార్యక్రమం



**శేరిలింగంపల్లి,నవంబర్ 21అక్షర వేదం**

శేరిలింగంపల్లి గోపి నగర్ జనచైతన్య సంఘం సభ్యుడు గ్రేటర్ హైదరాబాద్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ అధ్యక్షులు బజార్ ఘట్ రమేష్,ఆనంద్ స్థానిక చందానగర్ సబ్ ఇన్స్పెక్టర్ కాజా మోహినుద్దీన్ చే గోపి నగర్ బీసీ హాస్టల్ విద్యార్థులకు గంజాయి,మాధకాద్రవ్యలు పట్ల అవగాహన కల్పించడంతోపాటు గంజాయి వంటి మాదకాకద్రవ్యాలు జీవితాలను ఎలా దెబ్బతీస్తాయి ఆరోగ్యానికి ఎంత హానికరమో దాని వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు చదువు జీవితంలో ఎంత ముఖ్యమైన చదువు వారి భవిష్యత్తును ఎలా మారుస్తుంది అని విషయాలను తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ అధ్యక్షులు రమేష్, ఆనంద్ బీసీ హాస్టల్ వార్డెన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఇంద్రపాలెం శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి వారినీ దర్శించుకున్న సినీ నటుడు గౌతమ్ రాజు దంపతులు.



**కాకినాడ,నవంబర్ 21 అక్షర వేదం**

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ స్థానిక ఇంద్రపాలెం శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి వారి దర్శనానికి సినీ నటుడు గౌతమ్ రాజు దర్శనానంతరం గౌతమ్ రాజు దంపతులు చే ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించామని చొల్లంగి శ్రీనివాసరావు చైర్మన్ తెలిపారు.సినీ నటుడు గౌతమ్ రాజు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలను వెలిగించటం శివుడికి ఎంతో ప్రీతికరమైనది పిల్లి అప్పారావు గారి ఆశీస్సులు తో ఇంద్ర పాలెం లో వెంకట్ నగర్ నందు కొలువైయున్న శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని ఇక్కడే కోనేరు దగ్గర దీపాలను నీటిలో వదిలామని , స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రసాదాలు భక్తులు కి అందజేశామని స్వామివారి కృప భక్తులకు ఎల్లప్పుడూ ఉండాలని అదేవిధంగా స్వామివారి కి సేవలు చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్ కి బుజ్జి కి తదితరులు కి ఆ స్వామి ఆశీస్సులు పొందాలని ఈ ఆలయ అభివృద్ధికి సంబంధించిన సేవలు చేస్తున్న వారిని అందరిని ఆయన అభినందించారు. పత్రికాపూర్వకంగా ఆయన మాట్లాడుతూ తెలిపారు.పప్పు అప్పలరాజు కాశీ నుంచి తీసుకొచ్చిన శివలింగన్నీ శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం చైర్మన్ కి స్వామి వారి సన్నిధిలో అంద చేసినారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఆలయానికి ఎంతో సేవలు చేస్తున్న బుజ్జి మరియు ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**పటాన్ చేరు,అక్షర వేదం**

మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రాజా వారి బంగ్లా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాసభ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మల్లు రవి గార్లతో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రులు,నీలం మధు మాట్లాడుతూ మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన ద్వారా బీసీలకు



42 శాతం రిజర్వేషన్ల చట్టం కోసం అసెంబ్లీలో తీర్మానం చేసినా విషయాన్ని గుర్తు చేశారు. కొందరు అడ్డంకులు సృష్టించి బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను తాత్కాలికంగా అడ్డుకున్నారని కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన 42 శాతం టిక్కెట్లు బీసీలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సంసిద్ధంగా ఉందన్నారు, చిరకాలంగా ముదిరాజుల డిమాండ్ అయిన బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకుని పోవడం జరిగిందని పేర్కొన్నారు.త్వరలో అందరి పెద్దలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ ను కలిసి మన డిమాండ్లను సాధించుకుందామని తెలిపారు.మన సంక్షేమం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మనమంతా మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు వచ్చే స్థానిక ఎన్నికల్లో అందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు పలికి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పెబ్బేటి మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు పగిడాల శ్రీనివాసులు,మాజీ ఎంపీపీ భయ్యా వెంకటస్వామి, నాయకులు సుంకరబోయిన మహేష్, వాకిటి ఆంజనేయులు,చెన్న రాములు,కృష్ణయ్య,కేతురి వెంకటేష్, గాలెన్న,స్థానిక ప్రజాప్రతినిధులు,జిల్లా మత్స్యకారుల సంఘాలు,వేలాది మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి : టి డబ్ల్యూ జే ఎఫ్



**లోకేశ్వరం,నవంబర్ 21అక్షర వేదం**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టి.డబ్ల్యూ. జె.ఎఫ్.ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కు వినతి శుక్రవారం బైంసాలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజ్మీర సాంకేత్ కుమార్ కు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సహిల్ జావిద్,జిల్లా ఉపాధ్యక్షులు ఆశ మొల్ల మోహన్ మాట్లాడుతూ పాలకులు మారిన జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదని,తక్షణమే ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లా, డివిజన్ మండల కేంద్రాల్లో పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు,ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే జర్నలిస్టు జర్నలిస్టు సంక్షేమం పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు.తక్షణమే రాష్ట్ర జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటుచేసి నూతన అక్రిడిటేషన్ కార్డులు హెల్త్ కార్డులు ఇవ్వాల్సింది గా కోరారు.

# సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు

**- లోకేశ్వరం ఎస్సై జి అశోక్**

**లోకేశ్వరం:నవంబర్ 21అక్షర వేదం**

మండల కేంద్రంలో తో పాటు ఆయా గ్రామాల్లో సామాజిక మాధ్యమాల్లో ఇరు వర్గాలను రెచ్చగొట్టే విధంగా అనుచిత పోస్టులపై కఠిన చర్యలు తప్పవని,లోకేశ్వరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ జి అశోక్, హెచ్చరించారు.సోషల్ మీడియాలో వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్ట కు భంగం కలిగించేలా,దురుద్దేశాలను ఆపాదిస్తూ,అసత్యాలను ప్రచారం చేస్తూ,ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అనుచిత,విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాను




బాధ్యతగా, వినియోగించు కోవాలి. మతం,వర్గ,ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు,వీడియోలు లేదా వ్యాఖ్య లు చేస్తే చట్టపరమైన చర్యలు అనివార్యం అని ఎస్సై జి అశోక్,స్పష్టం చేశారు.






# స్పైథ్రిల్లర్ చిత్రంలో ప్రియాంక

ప్రియాంక మోహన్ కన్నడంలో బంపరాఫర్‌ను దక్కించుకుంది. ‘సప్తసాగరాలు దాటి’ ఫేమ్ దర్శకుడు హేమంత్ రావు డైరెక్షన్‌లో ‘666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’ పేరుతో ఓ స్పై థ్రిల్లర్ తెరకెక్కనుంది. ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో ప్రియాంక మోహన్ జాయిన్ అయింది. ఈ విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు మేకర్స్. 1980 దశకంలో నడిచే ఈ పీరియాడిక్ కథలో ప్రియాంక మోహన్ పాత్ర నవ్యరీతిలో ఉంటుందని చెబుతున్నారు. శివరాజ్‌కుమార్‌గారి సినిమాలు చూస్తూ పెరిగానని, ఆయన సినిమాలో భాగం కావడంతో తన కల నిజమైందని, కన్నడంలో తనకు బ్రేక్ నిచ్చే చిత్రమవుతుందని ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.

# ఓటీటీలోకి వచ్చేసిన ‘ది ఫ్యామిలీ మ్యాన్’ సీజన్ 3

ఇండియన్ పాపులర్ వెబ్ సిరీస్ ‘ది ఫ్యామిలీ మ్యాన్’ సీజన్ 3 ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ రెండు భాగాలుగా విడుదలై అమెజాన్ ప్రైమ్‌లో రికార్డులు సృష్టించింది. ఇప్పుడు ఇదే వెబ్ సిరీస్‌కి పార్ట్ 3 వచ్చింది. మొదటి రెండు సీజన్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ & డీకే ఈ సీజన్‌కి కూడా దర్శకత్వం వహించారు. ఇందులో పాతాళ్ లోక్ నటుడు జైదీప్ అహ్లావత్ విలన్‌గా కనిపించబోతుండగా ఈ చిత్రం నార్త్ ఈస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చింది.




# అరుంధతి పాత్ర చాలా ఇష్టం అన్న భాగ్యశ్రీ

అరుంధతీ’లో అనుష్క చేసిన తరహా పాత్రలంటే ఇష్టం అని నటి భాగ్యశ్రీ భోర్సే అన్నారు. రామ్ పోతినేని హీరోగా నటించిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలోమహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకర్లతో మాట్లాడారు. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వందశాతం న్యాయం చేసేలా పని చేస్తా. వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. ’ అలాంటి పాత్రలు నాకూ వస్తాయని ఆశిస్తున్నా’ అని భాగ్యశ్రీ భోర్సే అన్నారు. సినిమాలో మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథకు ఈ పాత్ర చాలా ఇంపార్టెంట్.. అదేంటి అనేది తెరపైనే చూడాలి. నా పాత్రను ఆడియన్స్ తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్‌తో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. అతని ఎనర్జీకి మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. సినిమా ఓ ఇంపార్టెంట్ సీన్‌ను దర్శకుడు వివరించారు. ఆ సన్నివేశాన్ని నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని దర్శకుడిని రిక్వెస్ట్ చేశా. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం ఆనందం కలిగించింది. నిర్మాత సంస్థ కూడా అంతే స్పేస్ ఇచ్చింది. కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. ఈ సినిమాలో తులసీ, రావు రమేశ్, మురళి శర్మ వంటి అద్భుతమైన ఆర్టిస్ట్‌లతో పని చేశా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉపేంద్రగారితో నాకు ఒక్క సీనే ఉంది. ఆయన వెరీ హంబుల్, డౌట్ టు ఎర్త్ యాక్టర్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ ప్రేక్షకులు చూపించిన అభిమానానికి ఒక స్టార్‌ని ఇంతగా అభిమానిస్తారా అన్నది ప్రత్యక్షంగా చూశా. చాలా గొప్ప ఎమోషన్ అది. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారని ఆశ్చర్యపోయా. మహేశ్ ఈ కథ చెప్పిన తర్వాత అభిమానం అన్నదానికి ఆన్సర్ దొరికింది. రెండు సినిమాలకే మంచి పేరు, ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది అంటుంటే చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్ట్‌కు మాత్రమే ఆ అదృష్టం ఉంటుంది.




# ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..

## ‘ది రాజా సాబ్’ ఫస్ట్ సింగిల్ ఆ రోజే!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ది రాజా సాబ్’ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ ‘ది రాజా సాబ్’ నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహాబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

# భన్సాలీ ప్రొడక్షన్ నుంచి మరో లవ్ స్టోరీ




బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. ఇందులో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటించబోతున్నారు. లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంకి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి అనౌన్స్‌మెంట్ వీడియోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే మెట్రో లవ్‌స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.